క్లుప్తంగా...

1 నుంచి వృత్తి నైపుణ్య శిక్షణ

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రాంగణంలోని వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రంలో ఆగస్టు 1 నుంచి నిరుద్యోగులకు శిక్షణ కోర్సులు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, ఎంఎస్ఆఫీస్, సీసీటీవీ టెక్నీషియన్ కోర్సులున్నాయన్నారు. ఔత్సాహికులైన అభ్యర్థులు తమ అర్హత పత్రాలతో వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్ నుంచి విముక్తి ప్రసాదించాలి



అమ్మవారికి పూజలు చేస్తున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్

శంషాబాద్: బీఆర్ఎస్ పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించాలని పూజలు చేసినట్లు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సుభిక్షమైన పాలన బీజేపీతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. రైతుల సంక్షేమానికి కేంద్ర సర్కారు చేస్తున్న సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుని అన్నదాతలను గోస పెడుతుందన్నారు. దర్శించుకున్న వారిలో బీజేవైఎం నాయకులు కృష్ణంరాజు, మణికంఠ, విష్ణు తదితరులున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

యాకుత్‌పురా: బస్తీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రెహమత్ అలీ బేగ్ అధికారులకు సూచించారు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి జలమయమైన తలాబ్‌చంచలం డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలతో పాటు పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, నాలా అభివృద్ధి పనులను ఆయన కార్పొరేటర్ డాక్టర్ సమీనా బేగం, పార్టీ నాయకులు, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. భవానీనగర్, నషేమాన్‌నగర్, తలాబ్‌కట్టా, సిద్దీఖీనగర్ ప్రాంతాల్లో పర్యటించి డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

శాతం చెరువు తూము పనుల పరిశీలన



గోల్కొండ: శాతం చెరువు తూము ఆధునీకరణ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తామని నానల్‌నగర్ కార్పొరేటర్ ప్రతినిధి హారూన్ ఫరాన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ నయాఖిలాలోని శాతం చెరువు తూము పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాతం చెరువులో భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతున్నందున నదీమ్ కాలనీకి ముంపు ప్రమాదం ఏర్పడిందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బల్దియా, ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి తూము మరమ్మతులు పనులు ఆమోదింపజేశారన్నారు. ఈఈ వెంకటేష్ తదితరులున్నారు.

ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం.. గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్: ఔటర్ రింగు రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రాళ్లగూడ ఔటర్ రింగురోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి (45) గురువారం తెల్లవారుజామున రోడ్డు దాటుతుండగా ఎయిర్‌పోర్టు నుంచి గచ్చిబౌలి వైపు వెళుతున్న వ్యాగనర్ కారు ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బాల్య వివాహం కేసులో నిందితులకు 20 ఏళ్ల జైలు

చాంద్రాయణగుట్ట: బాల్య వివాహం జరిపించిన ఘటనలో ముగ్గురు నిందితులకు న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించగా.. మరో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్షను విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. జంగమ్మెట్ బుడగజంగాల బస్తీకి చెందిన 14 ఏళ్ల బాలికకు చదువుపై ఎంతో ఇష్టం ఉన్నప్పటికీ.. బలవంతంగా 2018 ఆగస్టు 12న సుధాకర్(22)తో వివాహం జరిపించారు. ఈ ఘటనపై సీడబ్ల్యూఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు ఛత్రినాక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించిన పోక్సో యాక్ట్ స్పెషల్ సెషన్స్ జడ్జి అనిత సుధాకర్‌తో పాటు అతని తల్లిదండ్రులు జంగయ్య(45), సునిత(40)లకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, మధ్యవర్తిత్వం వహించిన బాలయ్య(33), రాధిక(35) రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరిచారు. బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం కూడా చెల్లించాలని ఆదేశించారు.

రహదారి ఇలా..వెళ్లేదెలా?



బురదమయంగా మారిన రహదారులు

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు పూర్తిగా చిత్తడిగా మారాయి. వర్షం నీరు, మట్టి కలిసిపోయి పూర్తిగా బురదమయంగా మారాయి. దాత్రి కాలనీ, హుడా లెఅవుట్, బండ్లగూడ, కిస్మత్‌పూర్, గంధంగూడ, పీరంచెరువు తదితర ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ బురద దారిలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాదారులు కిందపడిపోయి ప్రమాదాలబారినపడుతున్నారు. నడిచేందుకు సైతం వీలు లేకపోవడంతో ప్రజలు నానా అవస్తలు పడుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు మరమ్మత్తులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– బండ్లగూడ



చెత్తను రోడ్లపై వేయకండి: డీసీ రవికుమార్



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ రవికుమార్

అత్తాపూర్: దుకాణాల నిర్వాహకులు చెత్తచెదారాలను రోడ్లపై వేయవద్దని డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకొని అందులో చెత్తను భద్రపరచాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ రవికుమార్ వెల్లడించారు. శుక్రవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని టీ వెండర్స్, తదితర దుకాణాల యజమానులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోజు ఏర్పడే చెత్తను దుకాణాల ముందు, రోడ్లపై పడేవేయవద్దు అన్నారు. చెత్తను డస్ట్‌బిన్‌లలో భద్రపరచాలన్నారు. చెత్త సేకరణ ఆటోలు వచ్చిన సమయంలో కార్మికులకు అందించాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఉస్మానియాలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కాటేదాన్ లక్ష్మీగూడకు చెందిన అయాన్, మహి(18)లు నగరంలోని కాఫీ డేలో పని చేస్తున్నారు. ద్విచక్ర వాహనంపై గురువారం ఉదయం పి.వి.నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వేపై నుంచి వెళ్తు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో అయాన్ అక్కడికక్కడే మృతి చెందగా మహిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీని ఆధునీకరించాలి



వరద నీటి సమస్యను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కార చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు వై.శ్రీధర్ వెల్లడించారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.బాబు రావు ఆధ్వర్యంలో శివరాంపల్లి, ఉప్పర్‌పల్లిలోని బస్తీలు, కాలనీలలో నాయకులతో కలిసి పర్యటించారు. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాల దాటికి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అంతలాకుతలమైపోయిందన్నారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ స్పందించలేదన్నారు. అసలు రాజేంద్రనగర్ డివిజన్‌కు కార్పొరేటర్ ఉన్నారనా అని ప్రజలు అడుగుతున్నారన్నారు. ఇంత వర్షం పడి డివిజన్ మొత్తం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కార్పొరేటర్ ఎక్కడ ఉన్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. వెంటనే కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, కొత్త సోల్కర్‌రెడ్డి, బండారి బాలకృష్ణ, సందీప్‌ముదిరాజ్, మూల శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కనువిందు త్రివేణి సంగమం



లంగర్‌హౌస్: వరదలతో వాగులు కళకళలాడుతున్నాయి. హిమగంగగా పిలవబడే కొడంగల్ నుండి హిమయత్‌సాగర్ జలాశయం మీదుగా ఈసా, ముచుకుందగా పిలవబడే మూసా అనంతగిరి కొండల నుండి గండిపేట మీదుగా లంగర్‌హౌస్ వద్ద గుప్తగంగతో కలిసి త్రివేణి సంగమంగా మారుతుంది. ఇక్కడి నుండి మూసీగా మారి ప్రవహిస్తుంది. ప్రస్తుతం ఈ మూడు కలయిక ప్రాంతమయిన లంగర్‌హౌస్ త్రివేణి సంగం కనువిందు చేస్తోంది. మూడు కలిసే ప్రాంతంలో శివాలయం మునిగి ఆలయం పై ఉన్న శివుని పాదాలు కడుగుతు మూడు పాయలు అద్భుతంగా కనువిందు చేస్తుండటంతో పర్యాటకులు ఫోన్లలో బంధిస్తున్నారు.

జలమండలి డీజీఎంతో కార్పొరేటర్ సమావేశం



మజ్లిస్ నాయకులతో మాట్లాడున్న డీజీఎం జమీల్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జలమండలి డీజీఎం జమీల్‌తో శుక్రవారం సులేమాన్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో డ్రైనేజీ, వరద నీటి కాలువల మరమ్మత్తులు, పూడికతీతపై చర్చించారు. అనంతరం కార్పొరేటర్ ప్రతినిధి నవాజుద్దీన్ మాట్లాడుతూ ప్రస్తుతం బస్తీలు, కాలనీలతో పాటు ప్రధాన రహదారులపై డ్రైనేజీ నీరు పొంగిపోర్లుతుందన్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీ లీకేజీని సిబ్బంది మరమ్మత్తులు చేపడుతున్నారని కొన్ని ప్రాంతాల్లో కొత్తగా పైపులైన్ వేయాల్సి ఉందన్నారు. అలాగే వరద నీటి కాలువల్లో చెత్తచెదారాలు పేరుకుపోయాయని వాటిని తొలగించాలని డీజీఎంకు విన్నవించినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పైకప్పులకు మరమ్మతులు చేయాల్సి ఉందని వెల్లడించారు. పనుల విషయమై తగు చర్యలు తీసుకుంటామని డీజీఎం హామీ ఇచ్చారన్నారు.

3న ఉద్యోగుల సభ

గన్‌ఫౌండ్రీ: ఆగస్టు 3న కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఉద్యోగుల సభ నిర్వహిస్తున్నట్లు టీఎన్జీఓ నగర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సనీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో నగర శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగుల పరిష్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం అమలు, జీఓ 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం, ఆరోగ్య కార్డులు అందజేత వంటి సమస్యలను తక్షణమే పరిష్కారించాలని కోరారు. అనంతరం డీఈఓ కార్యాలయ ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. టీఎన్జీఓ నగర కార్యదర్శి విక్రమ్, పాఠశాల విభాగం నగర అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటలకు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'ఎంపవరింగ్ ది ఫ్యామిలీ' అనే అంశంపై ఢిల్లీకి చెందిన సీనియర్ రాజయోగిని, బ్రహ్మకుమారీస్ విమెన్స్ వింగ్ చైర్‌పర్సన్ బి.కె.చక్రధారిదీదీ, హెడ్ క్వార్టర్స్ విమెన్స్ వింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ బికె సవితాదీదీ ఉపన్యాసాలు ఉంటాయి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ సమావేశం



వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్డీవో మల్లయ్య

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య శుక్రవారం సమావేశమైయ్యారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పార్టీల ప్రతినిధులతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పోలింగ్ బూత్‌ల పేర్ల మార్పు, అత్యధికంగా ఓటర్లు ఉన్న బూత్‌ల వివరాలు, ఆయా ప్రాంతాల్లోని బూత్‌ల వారిగా ఉన్న ఇబ్బందుల విషయమై చర్చించారు. నియోజకవర్గ పరిధిలో 16 బూత్‌ల పేర్లు మారాయి. అలాగే 1500 ఓటర్లు ఉన్న హైదర్‌గూడలోని పోలింగ్ బూత్ ఓటర్లను పక్కనే ఉన్న పోలింగ్ బూత్‌లోకి మార్చారు. వివిధ పార్టీల ప్రతినిధుల నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎమ్మార్వోలు, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీబీకా ఆలం ఊరేగింపునకు భారీ బందోబస్తు



ఏసీపీ దామోదర్‌రెడ్డి

యాకుత్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా 10వ మొహర్రం సందర్భంగా శనివారం ఏనుగు అంబారిపై నిర్వహించే డబీర్‌పురా బీబీకా ఆలం సామూహిక ప్రధాన ఊరేగింపుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ సూదిరెడ్డి దామోదర్‌రెడ్డి తెలిపారు. పురానీ హవేలిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని డివిజన్‌లోని మీర్‌చౌక్, రెయిన్‌బజార్, భవానీనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఆషూర్ ఖానాల వద్ద ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. డబీర్‌పురాలోని బీబీకా ఆలావా వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బీబీకా ఆలావాలోని అలంలాను దర్శించుకునేందుకు వచ్చే ప్రజలకు, ప్రముఖలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. ఈనెల 29న బీబీకా ఆలావా ఆలంల ప్రధాన ఊరేగింపును పురస్కరించుకోని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌కమిషనర్, దక్షిణ మండలం డీసీపీల పర్యవేక్షనలో 1000 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బందోబస్తులో నాలుగురు అదనపు ఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, 30 మంది ఇన్‌స్పెక్టర్లు, 50 మంది ఎసైలు, 15 ప్లాట్రూన్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, టాస్క్‌ఫోర్స్, షీటీమ్స్, ప్రత్యేక నిఘ బృందాలతో పాటు సివిల్, ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నానల్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు బస్తీలు, కాలనీలను అతలాకుతలం చేశాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు భరోసా ఇవ్వాల్సి అవసరం ఉందన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఉందని, పలువురు స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. నల్లాలో నీరు సైతం రంగు మారి వస్తుందని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. నల్లాల్లో కలుషిత జలాలు రాకుండా చూడాలని, తాను అధికారులను ఆదేశిస్తానన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఏఈ ఉదయ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ అలీ, స్థానిక మజ్లిస్ నాయకుడు షబ్బీర్ ఖాన్ తదితరులున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



వెంకటేశ్వర కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: అకాల వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, విద్యుత్, జలమండలి అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, నేతాజీనగర్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వీధిదీపాలు, డ్రైనేజీ, రోడ్లు తదితర సమ్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, నాయకులు చేవెళ పార్లమెంట్ ఎస్సీ మోర్చా కన్వీనర్ జోగి రవి, రంగారెడ్డి జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నెల్లుట్ల జగన్ పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్

అత్తాపూర్: వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అతలాకుతలం అయిందని, సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్తాపూర్ డివిజన్ వరద ముంపు ప్రాంతాలను ఆమె జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. త్వరితగతిన అభివృద్ధి పనులను నిర్వహించి సమస్యలను పరిష్కరించాలన్నారు. రోడ్లపై ఇబ్బందికరంగా నిలిచిన వరద నీటిని తొలగించి నాలాల్లోకి మళ్లించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మొండ్ర కొమురయ్య, నారగూడెం మల్లారెడ్డి, సాబాద విజయ్‌కుమార్, బి.సిద్ధేశ్వర్, రాజశేఖర్, రాజు పైల్వాన్, ముఖేష్, విశాల్, రమేష్, కిరణ్, ఉమాబాయి, లఖన్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లంకలసంగారెడ్డి

బండ్లగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ కార్పొరేటర్ లంకల నిఖిలసంగారెడ్డి పేర్కొన్నారు. కురుస్తున్న భారీ వర్షాలకు గోతులమయంగా మారిన రోడ్లకు ఆమె తన సొంత ఖర్చుతో రోడ్లకు మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో కిస్మత్‌పూర్ అపోలో ఫార్మసీ నుంచి టైల్స్ కాలనీ వరకు ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయంగా మారిందన్నారు. ఈ రోడ్డుకు మరమ్మత్తులు నిర్వహించాలని స్థానిక ప్రాంతాలకు చెందిన కాలనీ వాసులు, బస్తీల ప్రజలు, వాహనాదారులు విన్నవించారన్నారు. అధికారులు కూడా స్పందించలేదన్నారు. దీంతో తాను రోడ్డును పరిశీలించి తన సొంత నిధులతో మరమ్మతు చేయించానన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇతర రోడ్లకు మరమ్మత్తులు నిర్వహించాలని సూచించారు.

నూతన ఆర్డీఓను సన్మానించిన నాయకులు



ఆర్డీఓ మల్లయ్యను సన్మానిస్తున్న వివిధ పార్టీల నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన మల్లయ్యను రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు శుక్రవారం కలిసి సన్మానించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఆర్డీఓను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ్, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, బీజేపీ నాయకులు మల్లారెడ్డి, జాన్‌పాల్, కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ అధ్యక్షులు మోహమ్మద్ ఖాలేద్, ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేష్, బీఎస్పీ నాయకులు ఆదిరాల రవి, ఎంఐఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ, మైనార్టీ ప్రజలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



అబిడ్స్: బీసీ, మైనార్టీ వర్గాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో మైనారీలు, బీసీలకు లక్షరూపాయాల చొప్పున ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని మంత్రి తలసానికి నందకిశోర్ వ్యాస్ బిలాల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా మైనార్టీలకు, బీసీలకు లక్ష రూపాయాల ఆర్థిక సహాయం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దక్కిందన్నారు. అనంతరం బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ... నియోజకవర్గం పరిధిలో బీసీ, మైనార్టీలతో పాటు అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు ముందుంటానన్నారు. ఓ వైపు ఆదిత్య శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరపున సేవలు చేస్తూ మరోవైపు ప్రభుత్వ పథకాలను, ప్రభుత్వ ఆర్థిక సహాయాలను, ప్రభుత్వ రుణాలను మంత్రి తలసాని సహకారంతో నియోజకవర్గం నలుమూలలా అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, సునిల్‌సాహు, కోటి శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్, షేక్ మహ్మద్, అజర్, అవతారి యాదవ్, అనిత తదితరులు పాల్గొన్నారు.